క్లుప్తంగా

గ్రామాల్లో పర్యటించిన ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్



మిడ్జిల్: అయ్యవారిపల్లి, కొత్తూర్, లింబ్యాతండా తదితర గ్రామాల్లో ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ యాదయ్య, డీపీఓ వెంకటేశ్వర్లు బుధవారం పర్యటించారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పనితీరును పరిశీలించారు. ఎంపీడీఓ సాయిలక్ష్మి, ఎంపీఓ అనురాధ, సర్పంచ్‌లు రాధిక, సునీత, జంగారెడ్డి, మేఘన తదితరులు ఉన్నారు.

వింత గొర్రె పిల్ల జననం

గండీడ్: అంచన్‌పల్లిలో ఓ కాపరి మందలో వింత గొర్రె పిల్ల జన్మించింది. 8 కాళ్లు, ఒక తల, మూడు చెవ్వులతో ఉన్న ఈ గొర్రెపిల్లను చుట్టు పక్కల వారు తిలకించేందుకు పోటీపడ్డారు. కాగా గంటలోపే అది మృతి చెందడంతో కాపరి విచారం వ్యక్తం చేశారు.

అఘాయిత్యాలకు పాల్పడరాదు



భూత్పూర్: క్షణికావేశంతో అఘాయిత్యాల్యకు పాల్పడకుండా విద్యార్థులు మనోధైర్యంతో ముందుకు సాగాలని సైకాలజిస్టు శ్రీనివాస్ అన్నారు. స్పందనా ఇదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ వారి సహకారంతో బుధవారం భూత్పూర్ ప్రభుత్వ జూనియల్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు క్షణికావేశంతో జీవితాలను ఆత్మహత్యలతో ముగించడం సరికాదన్నారు. పలు సూచనలు చేశారు. కళాశాల సిబ్బంది ఉన్నారు.

అకాడమిక్ ఆడిట్ బృందం సందర్శన

జడ్చర్ల టౌన్: మాచారం గిరిజన బాలుర (నాగర్‌కర్నూలు) డిగ్రీ కళాశాలను బుధవారం అకాడమిక్ ఆడిట్ బృందం సందర్శించిందని ప్రిన్సిపాల్ నిరీక్షణ్‌రావు తెలిపారు. న్యాక్ బృందం పర్యటన ఏర్పాట్లలో భాగంగా బీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలకు చెందిన బృందం అకాడమిక్ ఆడిట్ నిర్వహించినట్లు వివరించారు. అధ్యాపకులు రవీందర్‌రావు, శ్రీనివాసులు, నీరజ, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

సంబుర 'బడి'



మహబూబ్‌నగర్ రూరల్: మండల పరిధిలోని కోడూర్‌లో రూ. 49.15 లక్షల వ్యయంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవనం అన్ని హంగులు పూర్తి చేసుకొని గురువారం ప్రారంభానికి సిద్ధమైంది. అన్ని సౌకర్యాలతో నిర్మించిన భవనంతో తరగతి గదుల కొరత తీరనుంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠశాల భవనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. సంవత్సరం క్రితం పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్లు చేతులెత్తేసినా విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సర్పంచ్ బి.శ్రీకాంత్‌గౌడ్ ప్రత్యేక చొరవతో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సహకారంతో త్వరగా భవన నిర్మాణం పూర్తయ్యేలా శ్రద్ధ తీసుకున్నారు. రూ. 25.19 లక్షలు జెడ్పీ నిధులు, రూ. 24 లక్షలు కలెక్టర్ ప్రత్యేక నిధులతో తరగతి గదుల నిర్మాణంతో పాటు ప్రహరీ పూర్తి చేశారు. భవనాన్ని గురువారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించనున్నారు.

బీజేపీ తరుపున బరిలో ఉంటా...

గండీడ్: బీజేపీ పార్టీలో చేరి పరిగి నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోఉంటానని లింగ బలిజా, లింగాయత్ రాష్ట్ర అధ్యక్షుడు వెన్న ఈశ్వరప్ప అన్నారు. బుధవారం మండల పరిధిలోని వెన్నచేడ్‌గ్రామంలో ఈశ్వరప్ప జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజాసేవ చేయాలన్న ఉద్దేశ్యంతో రాజకీయాల్లోకి వచ్చినట్లు తెలిపారు. మోదీ చేస్తున్న సేవకు ఆకర్షితుడినయ్యానని వివరించారు. అందుకే బీజేపీ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. జిల్లా సత్యసాయి సేవాసమితి కోఆర్డినేటర్ శివమల్లప్ప, సభ్యులు నరేందర్‌రెడ్డి, రాములు, మాజీ సర్పంచ్ గోపాల్, ఆయా జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపు ఖాయం

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని స్వామి వివేకనంద చౌరస్తాలో బీజేపీ సీనియర్ నాయకులు రతంగ్‌పాండురెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో కేంద్రంతో పాటు రాష్ట్రంలోనూ బీజేపీ గెలుపు ఖాయమన్నారు. నాయకులు రాములుగౌడ్, శ్రీధర్, గోవిందునాయక్, యాదిరెడ్డి, చెన్న తదితరులు పాల్గొన్నారు.

యువతకు ప్రోత్సాహం



రాజాపూర్‌లో క్రీడాసామగ్రి కిట్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

రాజాపూర్: గ్రామీణ ప్రాంతాల్లోని యువతను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో 17 గ్రామ పంచాయతీలకు క్రీడాసామగ్రి కిట్‌లను అందజేశారు. సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి ప్రతిభను వెలికి తీసేందుకు కృషిచేస్తున్నారని వివరించారు. కొందరు పథకాలు చూసి ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. అనంతరం బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కొప్పిరిబచ్చిరెడ్డి, ఎంపీపీ సుశీల, వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, ఎంపీడీఓ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్: ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి బుధవారం మండల కేంద్రంలో స్పోర్ట్స్ కిట్స్‌ను పంపిణీ చేశారు. ఎంపీపీ సుదర్శన్, జెడ్పీటీసీ శశిరేఖా, సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కొత్త భిక్షగాళ్లు వస్తుంటారు

బాలానగర్: ఎన్నికలు సమీపిస్తున్న వేళ గ్రామాలకు కొత్త భిక్షగాళ్లు వస్తారని, ఏవేవో ఆశలు చూపుతుంటారని, వాళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారో నిలదీయాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రజలకు సూచించారు. బుధవారం కేతిరెడ్డిపల్లి సర్పంచ్ రాంరెడ్డి, డిప్యూటీ సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరిన సందర్భంగా మాట్లాడారు. వైస్ ఎంపీపీ వెంకటచారీ తదితరులు ఉన్నారు.

ముఖ్యమంత్రి ఎవరని గ్యారెంటీ ఇవ్వరు

జడ్చర్ల టౌన్: ముఖ్యమంత్రి ఎవరనే గ్యారెంటీ ఇవ్వని పార్టీ ఇచ్చే.. ఆరు గ్యారెంటీలు ఎలా విశ్వసిస్తారని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం క్యాంప్ కార్యాలయంలో బతుకమ్మ చీరల పంపిణీ ప్రారంభించి మాట్లాడారు. స్పోర్ట్స్ కిట్‌లను, షాదీ ముబారక్ చెక్కులను సైతం అందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, జెడ్పీవైస్‌చైర్మన్ కోడ్గల్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలకు ఓటమి తప్పదు



పార్టీలో చేరిన వారితో కాంగ్రెస్ నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న బీఆర్‌ఎస్, బీజేపీ ప్రభుత్వాలకు రానున్న ఎన్నికల్లో ఓటమి తప్పదని టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. టంకర, కొత్తపేట, గుడిమల్కాపూర్, చిన్నదర్పల్లి గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీలో చేరిన సందర్భంగా మాట్లాడారు. డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి తదితరులు ఉన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీలు ఒక్కటేనని, వారి నాటకాన్ని ప్రజలు గమనిస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అన్నారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల్లో కాంగ్రెస్ ఆదరణను తట్టుకోలేక ఈ రెండు పార్టీలు ఒక్కటయ్యాయని ఆరోపించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్ పార్టీ టికెట్ స్థానిక నాయకులకే వస్తుందన్నారు. సీనియర్ నేత ఎన్‌పీ వెంకటేశ్, మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

గ్రామసభలోనే ఎంపిక చేయాలి



చిన్నచింతకుంట: సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక గ్రామ సభల్లోనే జరగాలని కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు ఎస్ వెంకటేష్ డిమాండ్ చేశాడు. బుధవారం మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో నిరసన చేపట్టారు. అనంతరం ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అంతిమ పోరాటానికి సిద్ధం కావాలి

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణపై అంతిమ పోరాటానికి సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ కన్వీనర్ టైగర్ జంగయ్య పిలుపునిచ్చారు. ఈనెల 7న ప్రారంభమయ్యే విశ్వరూప మహా పాదయాత్ర వాల్‌పోస్టర్లను ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు ఆవిష్కరించారు. పోలే బాలయ్య, బాలరాజు, వెంకటస్వామి, రాములు పాల్గొన్నారు.



పోస్టర్లతో నాయకులు

జడ్చర్ల టౌన్: ఎస్సీవర్గీకరణ డిమాండ్‌తో ఈనెల 7నుంచి అలంపూర్‌లో మందకృష్ణ నేతృత్వంలో ప్రారంభం కానున్న విశ్వరూప మహాపాదయాత్రకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ జంగయ్యమాదిగ బుధవారం పట్టణంలో ఆవిష్కరించారు. పాదయాత్రకు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. కొంగశినాగరాజు, వెంకటయ్య, రాజు, వినోద్ మాదిగ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు సన్మానం



మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా బక్కి వెంకటయ్య ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా బుధవారం ఆయనను నకిలీ మదాసీ/ మదారి కురువల ఎస్సీ సర్టిఫికెట్ల వ్యతిరేక పోరాట సమితి సభ్యులు కలిశారు. రాష్ట్ర కన్వీనర్ మల్లెపోగు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సన్మానించారు. నకిలీ ధ్రువపత్రాల విషయంపై ఆయనతో మాట్లాడారు. రద్దు చేయించాలని విజ్ఞప్తి చేశారు. కో–కన్వీనర్ గోపాల్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

అధికారుల పనితీరులో మార్పు అవసరం



అధికారులను నిలదీస్తున్న ప్రజాప్రతినిధులు

- సర్వసభ్య సమావేశంలో సమస్యలపై నిలదీసిన ప్రజాప్రతినిధులు
- పలువురు మహిళా ప్రతినిధుల స్థానంలో హాజరైన భర్తలు, కుమారులు

నవాబుపేట: సమస్యలు పరిష్కరించటంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు నిలదీశారు. పనితీరులో మార్పు అవసరమని బుధవారం మండలకేంద్రంలో ఎంపీపీ అనంతయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో అన్నారు. దేపల్లిలో ఐదేళ్ల క్రితం వాటర్ ట్యాంకు నిర్మిస్తే నేటికీ కనెక్షన్ ఇవ్వలేదని సర్పంచ్ శ్రీలతరెడ్డి ఆరోపించారు. కొల్లూర్ తండాలకు నీరు అందించడంలో విఫలం అవుతున్నారని ఎంపీటీసీ తులసీరాంనాయక్, చౌడూర్ ఎంపీటీసీ గోపీకృష్ణ నిలదీశారు. ఇన్‌చార్జ్ అధికారితో మండలంలో విద్యావ్యవస్థ చాలా దారుణంగా ఉందని, పర్యవేక్షణ కరువైందని సభ్యులు అన్నారు. గ్రామాల్లో కుక్కల బెడదపై సర్పంచ్‌లు మాట్లాడారు. విద్యుత్ సమస్యలపై ఎంపీటీసీలు, గొర్రెల పంపిణీపై సర్పంచ్‌లు నిలదీశారు. కాగా సమావేశంలో కొంతమంది మహిళా ప్రజాప్రతినిధులకు బదులు వారి భర్తలు, కుమారులు హాజరై ప్రశ్నించడం కనిపించింది. మహిళ ప్రతినిధులు రాకపోవడంపై పలువురు పెదవి విరిచారు. రైతుబంధు చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీలత, ఆర్‌ఐ గోవర్ధన్, అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ

నవాబుపేట: మండలంలో జరిగిన ఉపాధి పనులకు సంబంధించి గురువారం సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీలత, ఏపీఓ జ్యోతీ బుధవారం విలేకరులకు వివరించారు. మండలం మొత్తం రూ.12 కోట్ల పనులు పూర్తి చేశామని వాటికి సంబంధించి గురువారం బహిరంగ చర్చా వేదిక ఉంటుందన్నారు. ప్రజాప్రతినిధులు, ఉపాధి కూలీలు తదితరులు తప్పక హాజరుకావాలని సూచించారు.

గ్యాస్‌లీకేజీ: తప్పిన ప్రమాదం

జడ్చర్ల: పట్టణంలోని పాతబజార్ నివాసముండే గణేశ్ ఇంట్లో బుధవారం రాత్రి గ్యాస్ లీకేజీ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే .. ఇంట్లో వంట చేస్తుండగా సిలిండర్ నుంచి గ్యాస్ లీకేజీ అయ్యింది. దీంతో మంటలు వ్యాపించాయి. వెంటనే అప్రమత్తమైన కుటుంబ సభ్యులు గోనెసంచులు తడిపి మంటలను ఆర్పివేశారు. దీంతో ప్రమాదం తప్పిందని బాధితులు తెలిపారు.

కొనసాగుతున్న దీక్షలు



కోయిల్‌కొండ: గార్లపహాడ్‌ను మండల కేంద్రంగా ప్రకటించాలని జేఏసీ ఆధ్వర్యంలో 256వ రోజు బుధవారం రిలేదీక్షలు కొనసాగాయి. కోకన్వీనర్ వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

మహాధర్నా వాల్ పోస్టర్ విడుదల



చిన్నచింతకుంట: చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8న ఎక్లాస్‌పూర్ స్టేజ్ వద్ద ధర్నా నిర్వహించనున్నారు. ఈ మేరకు వాల్ పోస్టర్‌ను బుధవారం మండల కేంద్రంలో కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో విడుదల చేశారు. టీఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి యాదగిరి మాట్లాడారు. జస్టిస్ బి.చంద్రకుమార్ తదితరులు ముఖ్యఅతిథులుగా వస్తారని వివరించారు. లక్ష్మయ్య, రాంచంద్రయ్య, మల్లేష్, మధు ఉన్నారు.

జోరుగా శంకుస్థాపనలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని వివిధ వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు నాలుగోరోజు బుధవారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ శంకుస్థాపన చేశారు. 44, 28, 34, 18 తదితర వార్డులో డ్రెయినేజీ, సీసీరోడ్లు, తదితర అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, భూమిపూజలు చేశారు.

పండుగలకు సముచిత స్థానం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: తెలంగాణలో అన్ని పండుగలకు సముచిత స్థానం కల్పించామని మంత్రి అన్నారు. బుధవారం రాత్రి ఎనుగొండలో బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. అనంతరం పలువురు నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయా కార్యక్రమాల్లో ముడా చైర్మన్ వెంకన్న, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, వైస్‌చైర్మన్ తాటి గణేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పర్యటన

హన్వాడ: మండలంలోని గురువారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పర్యటించనున్నట్లు అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

మొల్లమాంబ గొప్ప కవయిత్రి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రామాయణాన్ని అర్థమయ్యే భాషలో రాసిన గొప్ప కవయిత్రి మొల్లమాంబ అని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గ్రీన్ బెల్టు వద్ద ఆమె విగ్రహాన్ని ఆవిష్కరించారు. గత ప్రభుత్వాలు సరైన గౌరవం ఇవ్వకపోవడంతో ఆమె చరిత్ర బయటికి రాలేదన్నారు. శాలివాహన కుమారుల చరిత్ర ఎంతో గొప్పదని వివరించారు. కనుమరుగైపోతున్న కులాలను, వృత్తులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాదులో రూ. 200 కోట్ల విలువచేసే భూములను ఆత్మ గౌరవ భవనాలకు కేటాయించిందని అవసరమైన నిధులు కూడా కేటాయించిందని వివరించారు. హన్వాడలో సత్యమ్మకు విలువైన భూమిని కుండలు చేసుకునేందుకు ఇచ్చామన్నారు. బోయపల్లి లోనూ స్థలం ఇచ్చి అడిగిన వెంటనే బోరు వేయించామని పేర్కొన్నారు. కమ్యూనిటీ హాలు నిర్మాణానికి 2000 గజాల స్థలము, రూ.20 లక్షలు ఇస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు జస్వంత్ రావు, బీసీ సమాజ్ వ్యవస్థాపకుడు సూర్యారావు, జిల్లా అధ్యక్షుడు బుగ్గన్న, రామచందర్, ముడా చైర్మన్ వెంకన్న, మున్సిపల్ చైర్మన్ నర్సింహులు తదితరులు ఉన్నారు .

అందరికీ ఆత్మగౌరవ భవనాలు

కుర్వ సామాజిక వర్గానికి భవనం నిర్మించేందుకు ఎదిర శివారులో ఒక ఎకరా స్థలాన్ని కేటాయిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

బుధవారం క్యాంపు కార్యాలయంలో నాయకులకు ప్రొసీడింగ్స్ కాపీ అందజేశారు. స్థానికంగా జరిగిన మున్నూరుకాపు ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆత్మగౌరవ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు.

చిన్నారి అభిమానం

జిల్లా కేంద్రంలోని మోతినగర్ కు చెందిన ప్రభాకర్ కుమార్తె హరిప్రియ మంత్రిపై అభిమానాన్ని చాటుకుంది. బుధవారం మోతినగర్ వచ్చిన మంత్రి కాన్వాయ్‌ని పలువురు చిన్నారులు ఆపారు. మంత్రి వాహనం దిగి రాగా హరిప్రియ తాను పొదుపు చేసిన నగదును రాబోయే ఎన్నికల కోసం అంటూ అందించింది. దీంతో మంత్రి ఫిదా అయ్యారు. బాలవాక్కు బ్రహ్మ వాక్కు అని ఘనవిజయం సాధిస్తామని పేర్కొన్నారు.

వాలీబాల్ విజేత బాలానగర్



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న కార్యదర్శులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో అండర్–17 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వాలీబాల్ బాల, బాలికల టోర్నీ కమ్ సెలక్షన్స్ బుధవారం నిర్వహించారు. టోర్నీలో జిల్లాలోని మండలాల జట్లు పాల్గొన్నాయి. రెండు విభాగాల్లోనూ బాలానగర్ విజేతగా నిలిచింది. బాలుర విభాగంలో మహమ్మదాబాద్, బాలికల విభాగంలో మహబూబ్‌నగర్ రూరల్ రన్నరప్‌గా నిలిచాయి. అండర్–19 కార్యనిర్వాహక కార్యదర్శి పాపిరెడ్డి, అండర్–14, 17 విభాగాల కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్‌బాబు ట్రోఫీలు అందజేశారు. రాష్ట్రస్థాయి టోర్నీలో సత్తాచాటాలని ఆకాంక్షించారు. టీజీపెటా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్, జిల్లా వాలీబాల్ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి చెన్న వీరయ్య, ఎస్‌జీఎఫ్ సహాయ కార్యదర్శి వేణుగోపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: జిల్లాస్థాయి పోటీల్లో రన్నరప్‌గా నిలిచిన మహమ్మదాబాద్ క్రీడాకారులను ఉపాధ్యాయులు, విద్యార్థులు బుధవారం అభినందించారు.

అన్ని వర్గాల వారికి కేసీఆర్ వరాలు



గొర్రెలు అందిస్తున్న ప్రజాప్రతినిధులు

నవాబుపేట: తెలంగాణలో అన్ని వర్గాల వారికి కేసీఆర్ వరాలు కురిపిస్తున్నారని జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సిములు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గొర్రెలను లబ్ధిదారులకు అందించారు. సర్పంచ్ గోపాల్‌గౌడ్, ఉపసర్పంచ్ శ్రీశైలం పాల్గొన్నారు.

కోయిల్‌కొండ: ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ విజయ్ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం కనాయపల్లిలో గొర్రెల పంపిణీ చేపట్టారు. అనంతరం నల్లవల్లి, చంద్రాస్‌పల్లి తదితర గ్రామాల్లో బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. సింగిల్ విండోచైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట సభకు తరలిన నాయకులు



భూత్పూర్ నుంచి వెళ్తున్న నాయకులు

భూత్పూర్: కొత్తకోటలో హరీశ్ రావు బహిరంగ సభకు బుధవారం బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నరేష్ గౌడ్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర: కౌకుంట్ల, దేవరకద్ర మండలాల్లోని అన్ని గ్రామాల నుంచి బీఆర్‌ఎస్ నాయకులు భారీ ఎత్తున కొత్తకోటకు తరలివెళ్లారు.

కాంగ్రెస్ నాయకుల అరెస్టు



అడ్డాకులలో అరెస్టయిన కాంగ్రెస్ నాయకులు

అడ్డాకుల: మూసాపేట, అడ్డాకుల మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులను పోలీసులు బుధవారం ఉదయం అరెస్టు చేశారు. కొత్తకోటకు మంత్రి హరీశ్‌రావు వచ్చిన నేపథ్యంలో చర్యలు చేపట్టారు. నాయకులు సయ్యద్‌షఫీ, బాలరాజు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

దేవరకద్ర: మండలంలో అరెస్టయిన వారిలో కాంగ్రెస్ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు కేబీఆర్ గౌడ్, దేవరకద్ర అధ్యక్షుడు గోపాల్ ఉన్నారు. అదేవిధంగా మండల అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలను, సీఐటీయూ జిల్లా నాయకులు వేణుగోపాల్‌నూ పోలీసులు అరెస్టు చేశారు.

ఆశా వర్కర్ల భిక్షాటన



నవాబుపేటలో భిక్షాటన చేస్తున్న ఆశావర్కర్లు

సాక్షి నెట్‌వర్క్ : జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాలు, పట్టణాల్లో ఆశావర్కర్ల సమ్మె కొనసాగుతోంది. బుధవారం సమ్మె భాగంగా భిక్షాటన చేపట్టి నిరసన తెలిపారు.

నవాబుపేటలో నిర్మల, జ్యోతి, మాధవి తదితరులు భిక్షాటనలో పాల్గొన్నారు.

బాలానగర్‌లో ఆశాకార్యకర్తలు, తదితరులు కార్యక్రమం నిర్వహించారు.

రాజాపూర్‌లో సావిత్రి, మాధవి, యాదమ్మ, లక్ష్మీనర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

హన్వాడలో కృష్ణవేణి, పుష్ప, లక్ష్మి, యాదమ్మ, పారిజాత తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్‌లో ఆశా కార్యకర్తలు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ జంగయ్య, సురేష్, బాలమణి ,సుజాత తదితరులు పాల్గొన్నారు.

నేడు కురుమూర్తి ఆలయంలో వ్యాపారాలకు వేలం

చిన్నచింతకుంట: కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు, జాతర పురస్కరంచుకుని జాతర మైదానంలో వివిధ రకాల వ్యాపారాలు కొనసాగించేందుకు గురువారం స్వామి ఆలయం వద్ద బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మధనేశ్వర్‌రెడ్డి, చైర్మన్ ప్రతాప్‌రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా తలనీలాలు సేకరించుటకు, పూలదండలు, పూజసామాగ్రి, వాహనపూజ సామా గ్రి అమ్మేందుకు, రంగుల రాట్నాం, ఎగ్జిబిషన్ ఏర్పాటు, తడకలు, బొంగులు వ్యాపారస్తులకు వసతి కల్పించుటకు వేలం ఉంటుందని తెలిపారు. ఉదయం 10:30గంటలకు ప్రారంభమవుతుందని, ఆసక్తి కలిగినవారు వేలం పాల్గొనాలని వారు కోరారు.

పే స్కేల్ అమలుచేయాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పేస్కేల్ అమలు చేయాలని తెలంగాణ ఈ పంచాయతీ టెక్నికల్ వింగ్ జిల్లా అధ్యక్షుడు సురేందర్ డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జిల్లాకేంద్రంలో ధర్నా చేశారు. పంచాయతీ కార్యదర్శులు మద్దతు పలికారు. సంఘం నాయకుడు వెంకటయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బోరు మోటారు ప్రారంభం

నవాబుపేట: బట్టోనిపల్లి తండాలో బోరు మోటారును బుధవారం సర్పంచ్ మాన్యనాయక్ ప్రారంభించారు. భగీరథ నీరు వస్తున్నా పక్కన ఉన్న తండాలకు నీరు సరిగ్గా రాకపోవటంతో గిరిజనుల కోరిక మేరకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తన నిధుల నుంచి బోరు వేయించారని వివరించారు. మార్కెట్ వైస్ చైర్మన్ చందర్‌నాయక్, నానులాల్ పాల్గొన్నారు.